క్లుప్తంగా

సీఎంను కలిసిన జెడ్పీ చైర్మన్



ముఖ్యమంత్రిని కలిసిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: తాడేపల్లె క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

- డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి



చిత్తూరు రూరల్: ప్రభుత్వ సేవల్లో నిర్లక్ష్యం వహించారాదని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి దేవి హెచ్చరించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆరోగ్య కార్యక్రమాలపై అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొత్త ఆరోగ్య శ్రీకార్డుల పంపిణీ విధానాన్ని సమీక్షించారు. పీహెచ్‌సీలో ప్రసవించిన తల్లులకు నగదు పంపిణీ, జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం, అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో గర్భిణీ సేవలు, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, ఆస్పత్రి అభివృద్ధి, పల్స్ పోలియో నిర్వహణ..ఇత్యాది అంశాలపై చర్చించారు.

ఘనంగా కుంభాభిషేక మహోత్సవం



దేవతలకు పూజలు చేస్తున్న రామచంద్రనాయుడు కుటుంబ సభ్యులు

పూతలపట్టు: మండలంలోని పేటమిట్టలో శ్రీకోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట, కుంభాబిషేక మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం దేవస్థానం చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు చేతుల మీదుగా సమస్త దేవతావిగ్రహాలకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం గరుడవాహనం, మూషికవాహనాలకు దాతలు పూజలు చేశారు. యాగశాల మండపంలో అర్చకులు వివిధ దేవతలకు హోమాలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గల్లా అరుణకుమారి, జయదేవ్, మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ రాధాకృష్ణ, రామా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్, ఎంపీడీఓలకు సత్కారం

యాదమరి: మండలానికి కొత్తగా వచ్చిన తహసీల్దార్ దైవాధీనం, ఎంపీడీఓ సింగయ్యను మండల దళిత నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. దళిత నాయకులు మురుగేష్, రమణ, రవి, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేసుకోండి

గుడిపాల: స్థానిక సింగిల్ విండో సొసైటీలో రుణాలు తీసుకున్న వారు, డిపాజిట్ చేసిన వారితో పాటు ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేసుకోవాలని సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీఈఓ సెల్వం మంగళవారం తెలియజేశారు. రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్, పాన్‌కార్డ్, వన్–బీ జెరాక్సులను తమ కార్యాలయంలో ఇవ్వాలని కోరారు.

కుట్టి స్టడీ సెంటర్‌లో టెట్, డీఎస్సీ ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరుద్యోగ ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులకు ఉచితంగా టెట్, డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు కుట్టి స్టడీ సెంటర్ డైరెక్టర్ పవన కుమారి మంగళవారం విలేకరులకు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు టెట్, డీఎస్సీ ఆన్‌లైన్ దరఖాస్తులు, టెట్ మార్కుల జాబితా, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధృవపత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్లు, 4 ఫొటోలు తీసుకుని స్థానిక మిట్టూరులోని తమ స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 9491844963, 9490795693 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

సెల్‌ఫోన్ దొంగకు దేహశుద్ధి

పూతలపట్టు: సెల్‌ఫోన్ చోరీ చేసిన ఓ దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలు.. కొన్ని రోజులుగా సంతలో ఫోన్లు చోరీ జరుగుతున్నాయి. మంగళవారం సంతలో సెల్‌ఫోన్ అపహరించి, పారిపోతున్న యువకుడిని స్థానికులు గుర్తించి, పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం ఆ యువకుడిని పోలీసులకు అప్పగించారు. దీంతో వారు యువకుడిని విచారించి, అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని, యజమానికి అందజేశారు. ఆ తరువాత యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి, అతడిపై కేసు నమోదు చేయకుండా విడిచిపెట్టారు.

16న రథసప్తమి వేడుకలు

చిత్తూరు రూరల్: ఈనెల 16న శుక్రవారం స్థానిక ఆగస్తీశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్ శివాచార్యులు, ఆలయ చైర్మన్ శివప్రసాద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. రథసప్తమి పురస్కరించుకుని ఆలయంలో సూర్యభగవానుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేయనున్నట్టు చెప్పారు. అనంతరం శ్రీ కాలభైరవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ మాట్లాడారు.

విజయమే లక్ష్యం



ఎన్నికల ప్రచారం చేస్తున్న విజయానందరెడ్డి

- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రజలు ఆశీర్వదించాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి కోరారు. మంగళవారం నగరంలోని బ్రాహ్మణవీధి డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలిచారన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయన్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని పార్టీకి పట్టం కట్టాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కార్పొరేటర్ రమణ, పార్టీ యువ నాయకులు మనోజ్‌రెడ్డి, నాయకులు వెంకటేష్, మురగ, భువనేశ్వర్, సీఆర్‌సీ రవి, మల్లి ఆచ్చారి, బాలాజి, బెల్లంమండి సుధాకర్‌రెడ్డి, హరి, స్వర్ణకారుల నాయకులు శరవణ, ఎస్‌ఎ శరవణ నాయకర్, జ్యువెలర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఓబీసీ కేటగిరిలోకి మార్చరూ!

మొదలియార్ కులస్తులను దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఓసీ సామాజిక వర్గం నుంచి బీసీలుగా మార్చారని, తమను ఓబీసీ కేటగిరిలోకి మార్చేలా చూడాలని ఆ కుల సంఘ నాయకులు విజయానందరెడ్డిని ఆయన నివాసంలో కలిసి కోరారు. వారి విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. తాము వైఎస్సార్ సీపీకి మద్దతిస్తామని మొదలియార్ కులస్తులు తెలిపారు. తొలుత పిల్లారిగుడిలో స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. స్వర్ణకారుల సంఘం సభ్యులతో సమావేశమయ్యారు.

కార్యక్రమంలో మొదలియార్ సంఘం నాయకులు ఆర్ముగం, ఏజీ బాలాజి, ఆర్‌బీఎస్ రవి, గురుగణేష్, ఉదయ్, రాంగణేష్, సుకుమార్, బాలమురగన్, కార్పొరేటర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



విజయానందరెడ్డిని సన్మానిస్తున్న మొదలియార్ కులస్తులు

నేడు గుడిపాల మండలంలో..

గుడిపాల: మండలంలో బుధవారం చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ విజయానందరెడ్డి పర్యటించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జనార్ధన్ తెలిపారు. బుధవారం ఉదయం 7గంటలకు శ్రీరంగంపల్లె పంచాయతీలో ఇంటింటా ప్రచారం చేస్తారన్నారు. ఉదయం 10:30 గంటలకు గుడిపాలలో వైఎస్సార్ ఆసరా చెక్కులను ఆయన అందజేస్తారన్నారు. అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కులమతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

చిత్తూరు రూరల్: కులమతాలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తోందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు నగరం ఇరువారం చర్చిలో మంగళవారం పాస్టర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విజయానందరెడ్డి హాజరయ్యారు. ఆయన్ను పాస్టర్లు సన్మానించి, రాజకీయ భవిష్యత్ బాగుండాలని, మరిన్ని పదవులు వరించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కమ్యూనిటీ హాల్, పాస్టర్ల భద్రత, అంబులెన్స్ కావాలని పాస్టర్లు ఆయనను దృష్టికి తీసుకెళ్లారు. క్రైస్తవుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు పాస్టర్లకు ప్రతినెలా రూ.5 వేలను ప్రభుత్వం ఇస్తోందన్నారు. ప్రతి పేదల కష్టం జగనన్నకు తెలుసని, మేలు చేసే జననేతను మళ్లీ మనమంతా కలిసికట్టుగా గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు రవికుమార్, ప్రసాద్, కుమార్, ధనరాజ్, ఏఎస్ పాల్ తదితరులు పాల్గొన్నారు.



విజయానందరెడ్డిని సన్మానిస్తున్న చర్చి పాస్టర్లు

పూతలపట్టులో మాజీ ఎమ్మెల్యే సునీల్ జోరు



ఐరాల మండలంలో సునీల్‌కుమార్‌కు హారతులిస్తున్న మహిళలు

యాదమరి: సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పూతలపట్టు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ ప్రచారంలో ముందుకు వెళుతున్నారు. ప్రస్తుతం ఐరాల మండలంలోని పలు గ్రామాల్లో చేసిన ప్రచారానికి మంచి స్పందన లభించింది. ఆయనకు పాత పరిచయాలు ఉండడంతో ఆయా గ్రామాలలో ప్రజలు, మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

ఐరాల: ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండు కళ్లుగా రెండు కళ్లుగా భావించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని బొమ్మసముద్రం, తిమ్మాజిపల్లె, తిరువణంపల్లె, తిరువణంపల్లె దళితవాడ, బీసీ కాలనీ గ్రామాల్లో మంగళవారం నాయకులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. 57 నెలలుగా జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్ర ప్రచారం చేశారు. 14 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు ప్రజలకు ఒక మంచిపనైనా చేశారా? అని ప్రశ్నించారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను లూటీ చేశారన్నారు. ఓట్లు అడిగేందుకు గ్రామాల్లోకి వచ్చే పచ్చపార్టీ నేతలను జగనన్న అమలు చేసిన నవరత్నాల పథకాలు ఎందుకు మీ హయాంలో ఇవ్వలేదని నిలదీయాలన్నారు. వలంటీర్ వ్యవస్థ వద్దంటూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం బోధన వద్దంటూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇద్దరూ గగ్గోలుపెడుతున్నారని విమర్శించారు. ఎల్లోమీడియా ప్రజలను తప్పుదారిపట్టించేలా వార్తలు వండి వడ్డిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ మోహన్, మహిళ, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ చైర్‌పర్సన్ శైలజ, జెడ్పీటీసీ సభ్యురాలు సుచిత్ర, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ధనచంద్రారెడ్డి, సర్పంచులు శాంతిసాగర్‌రెడ్డి, రఘు, మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, పార్టీ నేతలు ప్రభాకర్‌రెడ్డి, చిన్నారెడ్డి, సురేష్‌రెడ్డి, రవిరెడ్డి, కరుణాకర్‌నాయుడు, మురగ, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరువణంపల్లెలో వృద్ధురాలికి కరపత్రం అందజేసి నమస్కరిస్తున్న సునీల్‌కుమార్

పేదల పక్షపాతి జగనన్న

పూతలపట్టు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక తెలిపారు. మంగళవారం మండలంలోని తేనేపల్లి పంచాయతీ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 307 మందికి వైద్యాధికారులు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఒక రోగిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి, సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ ఆనందయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, వైద్యాధికారులు జశ్వంత్, సోమకార్తిక్, రమేష్ బాబు పాల్గొన్నారు.

పాలకలలో..

ఐరాల: మండలంలోని పాలకల 2 సచివాలయం పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. మొత్తం 323 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే వృద్ధులకు కంటిపరీక్షలు చేసి కళ్లద్దాలు, హెల్త్‌కార్డులు అందజేశారు. పాలకల సర్పంచ్ వసంత ఈ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్లు పూర్ణలత, శిరీష, శారద, సీహెచ్‌ఓ సుగుణవతి, పీహెచ్ఎన్ జీవకళ, ఈఓపీఆర్డీ కుసుమ కుమారి, ఎంపీటీసీ విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

తవణంపల్లె: వెంగంపల్లెలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యాధికారులు డాక్టర్ మోహన్ వేలు, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ ప్రియాంక, ఆర్థో స్పెషలిస్టు డాక్టర్ చంద్రశేఖర్, జనరల్ మెడిసిన్ డాక్టర్ గోపి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ ధర్మారెడ్డి సురక్ష శిబిరంలో 322 మంది రోగులకు పరీక్షలు చేశారు. ఆర్థోకు సంబంధించి 68 మందిని, కంటి రోగులు 39 మందిని, జనరల్ కేసులు 116 మందిని మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేశారు. మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, రవిరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, జగన్నాధరెడ్డి, చెంగల్‌రెడ్డి, మధుకుమార్ పాల్గొన్నారు.

197 రామాపురంలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బొమ్మసముద్రం ప్రాధమిక వైద్యాధికారి అనూష..గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్, చక్కెరవ్యాధి గ్రస్తులకు ఇతర వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది సరస్వతి, దివ్య, అనురాధ, అశ్విని, కవిత పాల్గొన్నారు.



పూతలపట్టు: రోగికి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు



ఐరాల: పరీక్షలు చేస్తున్న డాక్టర్ శిరీష



తవణంపల్లె: వెంగంపల్లెలో..



గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

వంద రోజుల 'ఉపాధి'

తవణంపల్లె: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు వంద రోజులు పని కల్పించాలని డ్వామా పీడీ ఎస్. రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని దిగువ తడకర, తవణంపల్లె, పుణ్యసముద్రం పంచాయతీల్లో చేస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అలాగూ ఫారం పాండ్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను తనిఖీ చేసి మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఉపాధి పనులు పూర్తి చేయాలని క్షేత్రసహాయకులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల్లోని విభిన్న ప్రతిభావంతుల కుటుంబాలకు కుటుంబాలకు పనులు కల్పించాలని సూచించారు. ఏపీఎం సుబ్రమణ్యం, ఏపీఓ లలిత, సాంకేతిక సహాయకులు వెంకటరమణారెడ్డి, హంసవేణి పాల్గొన్నారు.



తవణంపల్లెలో రూఫ్ వాటర్ హార్వెస్టర్ స్ట్రక్చర్ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్

ఆరోగ్యశ్రీ కార్డులపై అవగాహన కల్పించాలి

యాదమరి: ఆరోగ్యశ్రీ కార్డులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని యాదమరి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. మంగళవారం యాదమరి ప్రభుత్వాస్పత్రిలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన నూతన ఆరోగ్యశ్రీ కార్డులతో లబ్ధిదారులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందవచ్చని తెలియజేయాలన్నారు. అలాగే ప్రధాన మంత్రి మాతృత్వ వందన పథకం కింద అర్హులైన గర్భిణులకు ఆర్థిక సాయం అందేలా వారికి సంబంధించిన నివేదికలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్

పశుబీమా పాడి రైతులకు వరం

తవణంపల్లె: పశువుల బీమా పథకం పాడి రైతులకు వరమని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని సరకల్లులో ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశుసంతతి పరిశీలనా పథకం కింద సంకరజాతి జెర్సీ పేయదూడల ప్రదర్శన నిర్వహించారు. పేయదూడల ప్రదర్శనను పశుసంవర్ధక శాఖ అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జేడీ మాట్లాడుతూ పేయదూడలను ఆరోగ్యంగా పోషించిన పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ హరీఫ్ మాట్లాడుతూ, పాలలో వెన్నశాతం పెరగడానికి ఎండుగడ్డి వేయాలన్నారు. మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీటీపీ డీడీ వాసు, డీడీ మృణాళిక, పశువుల వైద్యాధికారులు డాక్టర్ పల్లవి, డాక్టర్ లావణ్య, డాక్టర్ పిరాకమణి పాల్గొన్నారు.



పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్, అధికారులు

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



ఏఈఓ విద్యాసాగర్ రెడ్డికి విరాళం అందజేస్తున్న దాత, కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి నిత్యాన్నదాన పథకానికి వైఎస్సార్ జిల్లాకు చెందిన రామసుబ్బారెడ్డి రూ.2 లక్షలు విరాళం అందజేశారు. మంగళవారం ఉదయం దాత కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్ధం కాణిపాకం విచ్చేశారు. స్వామివారి దర్శనానంతరం నిత్యాన్నదాన పథకానికి రూ.2లక్షల విరాళం ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డికి అందజేవారు. దాతతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. వారికి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటిండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో అప్రమత్తం

యాదమరి: మండల పోలీసుస్టేషన్ తమిళనాడు సరిహద్దులో ఉన్నందున పోలీసులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం రాత్రి డీఎస్పీ పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా? లేదా అని ఆరా తీశారు. పోలీసు స్టేషన్‌లో క్రైమ్ రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీసులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలీసులు అనుమానం ఉన్న వాహనాలను ఆపి తనిఖీ చేయాలన్నారు. సరిహద్దు గ్రామాల్లో అక్రమంగా మద్యం, సారా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ సమస్యలను తెలుసుకున్నారు. డీఎస్పీ వెంట చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ ఉమాపతి రెడ్డి ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పలు జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు జేఈఈ మెయిన్స్ (సెషన్–1) ఫలితాల్లో ప్రతిభను చాటారు. ఈ ఫలితాలను ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) మంగళవారం విడుదల చేసింది.

పీఎస్ఎన్ (వివేకానంద) కళాశాలలో : మురుగానిపల్లెలోని పీఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాలలో చదువుతున్న చరిత్ చౌదరి 99.17, రిత్విక్‌రాజ్ 97.32, నేహిత్ 96.59, ప్రీతి 96.12, చందన 95.01, మహమ్మద్ సఫాన్ 94.58, పవన్ 94.24 పర్సంటైల్ సాధించారని ఆ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ తెలిపారు. 80 పర్సంటైల్‌కు పైగా 47 మంది ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపల్ నాగరాజుశెట్టి తదితరులు అభినందించారు.

శ్రీ చైతన్యలో : గాంధీరోడ్డులోని శ్రీ చైతన్య కళాశాలకు చెందిన అస్మ పూనమ్ 97.66, వర్షిత 95.73, యశ్వంత్ కుమార్ 95.32, గురుపవన్‌కుమార్ 92.43, తసీన్ 92.27 పర్సంటైల్ సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపల్ శివకుమార్ చెప్పారు.

విజయంలో : కొత్త బస్టాండ్ వద్ద ఉన్న విజయం జూనియర్ కళాశాల విద్యార్థులు లోకేష్ 93.75, జగదీష్‌ప్రసాద్ 88.77 పర్సంటైల్ సాధించారని, అలాగే 80కి పైగా 14 మంది పర్సంటైల్ సాధించారని కరస్పాండెంట్ తేజోమూర్తి వెల్లడించారు. విద్యార్థులను కళాశాల ఈడీ శైలజ, ప్రిన్సిపల్ జీవరత్నం అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పీఎస్ఎన్ కరస్పాండెంట్ సత్యనారాయణ



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య ప్రిన్సిపల్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించరూ!

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షులు రాఘవులు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, 30 శాతం ఫిట్‌మెంట్‌తో 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, సరెండర్ లీవులు మంజూరు చేయాలన్నారు. జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్స్‌ను వెంటనే విడుదల చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డిమాండ్ల సాధన కోసం 14వ తేదీ నుంచి 27వ తేదీ వరకు దశలవారీగా చేయ తలపెట్టిన కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో నాయకులు రఘు, చెంగలరాయ మండడి, భానుప్రకాష్, బాలసుబ్రహ్మణ్యం, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి



దరఖాస్తులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ



పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న కమిషనర్



పూతలపట్టు: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శివరాముడు

చిత్తూరు అర్బన్: తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు సమష్టి కృషి చేయాలని, ఓటర్ల నమోదు, సవరణల కోసం అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించడంతోపాటు బీఎల్వోలు క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని ఏఈఆర్వో, కమిషనర్ జె అరుణ ఆదేశించారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో చిత్తూరు అర్బన్ పరిధిలోని బీఎల్వోలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. తుది ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత స్వీకరించిన దరఖాస్తులపై సమీక్షించారు. కొత్తగా ఓటర్ నమోదుకు అందిన ఫారం–6, ఫారం–7, ఫారం–8, 8–ఏ లను బీఎల్వోలు కచ్చితంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. తగిన ధ్రువీకరణ పత్రాలు, సంతకాలు తీసుకుని ఆమోదం/ తిరస్కరణ కోసం సూపర్‌వైజర్ అధికారులకు సమర్పించాలన్నారు. బీఎల్వోలు సిద్ధం చేసిన దరఖాస్తులను సూపర్‌వైజర్ అధికారులు జాగ్రత్తగా తనిఖీ చేయాలన్నారు. ఆమోదం, తిరస్కరణ దరఖాస్తులను ఎలాంటి పొరపాట్లు లేకుండా అప్‌లోడ్ చేయాలన్నారు. ఫొటోల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, ఏసీపీ రామకృష్ణుడు, మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ లోకేష్, సూపర్‌వైజర్ అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

చిత్తూరు అర్బన్: స్థానిక షర్మన్ బాలిక ఉన్నత పాఠశాల, సీకే పల్లె ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఐటీఐ, బ్రిడ్జి స్కూల్, గాండ్లపల్లె ఉన్నత పాఠశాలలోని 11 పోలింగ్ కేంద్రాలను ఏఈఆర్వో, కమిషనర్ జె అరుణ మంగళవారం ఉదయం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, చేస్తున్న పనులతోపాటు ప్రధానంగా నీటి సరఫరా, విద్యుత్, ఫర్నీచర్, మరుగుదొడ్లు, రాంపుల నిర్మాణాలను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను, నిర్దేశించిన పనులు త్వరితగతిన పూర్తి చేసేలా ఇంజినీరింగ్ విభాగం ఏఈలు, డీఈలు సత్వరం చర్యలు తీసుకోవాలని, పనులను రోజూ పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈలు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పూతలపట్టు మండలంలో..

పూతలపట్టు: మండలంలోని ఎర్రచెరువుపల్లె, గాండ్లపల్లె, మద్దులయ్యగారిపల్లె, పేటపల్లె, ఎగువపాలకూరు పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ శివరాముడు పరిశీలించారు. బీఎల్వోలతో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నీచర్..ఇత్యాది సౌకర్యాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. ఫారం7, 8 మార్పులు– చేర్పులను సరిచూసి తుది జాబితాను అందజేయాలని బీఎల్వోలకు సూచించారు.